నేడు 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం'

గోల్కొండ: 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం' కార్యక్రమాన్ని ఈనెల 19న (నేడు) నిర్వహించనున్నట్లు మెహిదీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ బి.వి.కె.మూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు 9959226133 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు జీఎన్ఐటీఎస్‌లో మహిళా దినోత్సవం

గోల్కొండ: షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 19న (నేడు) అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేశ్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమెన్స్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్ పేరిట ఈనెల 19, 20 నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇన్ఫోసిస్ సెంటర్ హెడ్ ప్రెసిడెంట్ మనీషా సబు, స్కై రూట్స్ ఏరో స్పేస్ కోఫౌండర్ నాగభరత్ డాకా పాల్గొనున్నట్లు పేర్కొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ మన్నె ప్రేమ్‌కుమార్

అబిడ్స్: నాంపల్లి తహసీల్దార్ మన్నె ప్రేమ్‌కుమార్ హిమాయత్‌నగర్‌కు చెందిన 10 షాదీముబారక్, 8 కల్యాణలక్ష్మి చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైనవారు ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐలు అశ్విన్, అశోక్ పాల్గొన్నారు.

తెలుగు భాషను పరిరక్షించాలి




పురస్కారాలు ప్రదానం చేస్తున్న డాక్టర్ జి.చిన్నారెడ్డి

సుల్తాన్‌బజార్: తెలుగు భాషను పరిరక్షించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక మండలి ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో రెడ్డి ల్యాబ్ అధినేత డాక్టర్ కె.అంజిరెడ్డి సంస్మరణార్థం అందిస్తున్న పురస్కారాన్ని పత్రిక సంపాదకుడు బైసా దేవదాస్‌కు ప్రముఖ చరిత్ర పరిశోధకుడు డాక్టర్ బిఎన్.శాస్త్రి పురస్కారాన్ని తెలంగాణ చరిత్ర పరిశోధనలో విశేష సేవలందించిన ద్యావనపల్లి సత్యనారాయణకు, ప్రముఖ కవి డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్య ధర్మనిధి సాహిత్య పురస్కారాన్ని సినీ గీత కర్త మల్లిక్ తదితర ప్రముఖులకు మంగళవారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ కవి జీవి శ్యామ్‌ప్రసాద్‌లాల్, మడుపు ప్రభాకర్‌రావు, ప్రాచ్య కళాశాల ప్రధానాచర్యులు సిల్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించండి

అఫ్జల్‌గంజ్: వాటర్‌బోర్డులో బకాయిలు చెల్లించి కాంట్రాక్టర్లను ఆదుకోవాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, వాటర్‌బోర్డు కాంట్రాక్టర్ల జేఏసీ మీడియా ఇన్‌చార్జి పోల్కం శ్రీనివాస్ కోరారు. ఈమేరకు వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డితో మంగళవారం సమావేశమై ఆయనకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బకాయిలు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా చొరవ తీసుకుని బకాయిలు చెల్లించి ఆదుకోవాలని కోరినట్లు ఆయన తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యం



అంజమ్మ

సంతోష్‌నగర్: వృద్ధురాలు అదృశ్యమైన ఘటన ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్ డీఎస్‌నగర్‌కు చెందిన అంజమ్మ (60) భర్త మృతి చెందినప్పటి నుంచి మానసిక వ్యాధితో బాధపడుతోంది. దీనికితోడూ మద్యానికి బానిసైంది. కాగా ఈనెల 5న మద్యం కొనుగోలు చేసేందుకు చంపాపేట్‌కు వెళ్లింది. తర్వాత ఇంటికి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు సమీప ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేసిన ఫలితం లేకుండా పోయింది. దీంతో కుమారుడు రమణ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధ్వానంగా సర్వీస్ రోడ్లు..!

- తవ్వి..వదిలేసిన పద్మనాభనగర్ కాలనీ రహదారి
- రాకపోకలకు వాహనదారుల తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



తవ్వకాలతో ఎండిన మొక్కలు



పద్మనాభనగర్ కాలనీ సర్వీస్ రోడ్డును తవ్వి వదిలేసిన దృశ్యం

గోల్కొండ: కాలనీల సర్వీస్ రోడ్లు అధ్వానంగా మారాయి. అభివృద్ధి పనులపేరిట రోడ్లను తవ్విన అధికారులు సకాలంలో పనులు పూర్తి కాకపోవడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నానల్‌నగర్ డివిజన్‌లోని పద్మనాభనగర్ కాలనీ సర్వీస్ రోడ్డు పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొందని కాలనీ వాసులు వాపోతున్నారు. రేతిభౌలి రింగ్ రోడ్డు నుంచి లక్ష్మీనగర్ చౌరస్తా వైపు వెళ్లే రోడ్డు వైపున పద్మనాభనగర్ కాలనీ, కరోల్‌బాగ్ కాలనీ ఉన్నాయి. మెయిన్ రోడ్డుకు ఆనుకుని సర్వీస్ రోడ్డు ఉంది. దానికి ఆనుకునే బల్దియా వారు గ్రీనరీ ఏర్పాటు చేశారు. అయితే రోడ్ల అభివృద్ధికి చేపట్టిన తవ్వకాలు పచ్చని చెట్లకు శాపంగా మారాయి. అడ్డదిడ్డ తవ్వకాలతో పచ్చని చెట్లు సైతం ఎండిపోతున్నాయి. నెలల తరబడి పనులు పూర్తికాకపోవడంతో కాలనీవాసులతో పాటు వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

అంతర్గత రోడ్లు సైతం..

టోలిచౌకీ అల్‌హస్‌నత్ కాలనీ, నిజాం కాలనీల్లోని రోడ్లను అభివృద్ధి పనుల పేరిట తవ్వడంతో అవి కూడా అధ్వానంగా తయారయ్యాయి. దీనికితోడు కాలనీవాసులు తమ ఇళ్లకు వివిధ కారణాలతో రోడ్డును తవ్వి పైపులు వేసి అలాగే వదిలేస్తున్నారు. ఈ కారణంగా అక్కడ రోడ్డు మొత్తం దెబ్బతింటోంది. టోలిచౌకీ బాల్‌రెడ్డినగర్, ఖాదర్‌బాగ్ కాలనీల రోడ్లు సైతం నీటి, డ్రైనేజీ పైపులు వేసేందుకు తవ్వి అలాగే వదిలేస్తున్నారు. దీంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత స్పందించి పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని, అలాగే అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

అధికారుల పర్యవేక్షణ ఉండాలి



అభివృద్ధి పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే సకాలంలో పూర్తి కావడం లేదు. దీనికితోడూ నాణ్యతా ప్రమాణాలు సైతం పాటించడం లేదు. అసంపూర్తి పనులతో స్థానికులతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సత్వరమే పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలి.

–కె.కృష్ణా, కార్వాన్

కాంగ్రెస్ హయాంలోనే బీసీలకు న్యాయం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

గోల్కొండ: కాంగ్రెస్ హయాంలోనే బీసీలకు న్యాయం జరిగిందని, అందుకు బీసీలకు 43 శాతం రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదింపజేయడమే నిదర్శమని కాంగ్రెస్ కార్వాన్ సీనియర్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. గుడిమల్కాపూర్ లక్ష్మీనగర్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, బడుగు వర్గాలకు అండగా ఉండే పార్టీ కాంగ్రెస్ మాత్రమే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు అమీద్‌ఖాన్, నర్సింగ్‌గౌడ్, రాంకుమార్, ప్రేమ్‌కిశోర్, పరమానందం, షేక్ షకీలా, శారదా, గిరిజ తదితరులు ఉన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న జి.చిన్నారెడ్డి

గౌలిపురా: పాతబస్తీ హరిభౌలికి చెందిన అనంతోజు జయసేనకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.34 వేల ఆర్థిక సాయం మంజూరైంది. దీంతో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గ పార్టీ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి చేతుల మీదుగా బాధితుడికి మంగళవారం చెక్కు అందజేయించారు.

ఆలయాల వార్షికోత్సవం

గౌలిపురా: శ్రీరాంనగర్ కాలనీలోని శ్రీ హంపీ సంస్థానం శ్రీ బాలాజీ, అయ్యప్పస్వామి ఆలయం 25వ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం వరకు పూజా కార్యక్రమాలు అనంతరం అన్న ప్రసాదం అర్చకులు జె.గణేశ్ శాస్త్రి, జె.భద్రిశాస్త్రి, ఎం.సాయిపవన్ శర్మ, ఎం.రమేశ్ శాస్త్రి ఆధ్వర్యంలో జరిగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు వి.ఎస్.గణేశ్ గురుస్వామి, పోటేల్ సదానంద్ యాదవ్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

భవానీకాలనీలో హైడ్రా అధికారుల పర్యటన

బండ్లగూడ: పార్కు, ఆలయ, వాటర్ ట్యాంకర్ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని పరిరక్షించాలని కోరుతూ భవానీకాలనీ వాసులు సోమవారం ప్రజావాణిలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో హైడ్రా అధికారులు మంగళవారం భవానీ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా స్థలాలను పరిశీలించారు. స్థల పరిమితులు, భూస్వామ్య వివరాలు, భవిష్యత్‌లో ఈ స్థలాలను అభివృద్ధి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రాథమిక అధ్యాయనం ప్రారంభించారు. స్థలాల పరిరక్షణకు తగు చర్యలు తీసుకుంటామని హైడ్రా అధికారులు తెలిపారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హైడ్రా టీం సీఐ తిరుమల్లేశ్, కాలనీవాసులు అశోక్, శ్రీనివాస్, మల్లేశ్, మరిమల్‌రాజ్, రవిబొల్ల, నాగేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మనోజ్, వినోద్, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలను వివరించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి

గన్‌ఫౌండ్రీ: దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను ప్రస్తుత సమాజానికి వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే శివసేనారెడ్డి అన్నారు. ఎల్బీ స్టేడియంలోని తన కార్యాలయంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 94వ వర్ధంతి పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, నగర కార్యదర్శి ఎన్.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రాజెక్ట్‌వర్క్ అండ్ రిపోర్ట్ రైటింగ్' సదస్సు



సదస్సులో ప్రసంగిస్తున్న వీసీ సూర్య ధనుంజయ్



కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు

సుల్తాన్‌బజార్: వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో 'ప్రాజెక్ట్ వర్క్ అండ్ రిపోర్ట్ రైటింగ్' అనే అంశంపై సామాజిక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మహిళా విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ సూర్య ధనుంజయ్ హాజరై ప్రసంగించారు. సదస్సులను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రొఫెసర్ శ్రీగణేశ్ మాట్లాడుతూ.. రోజువారీ ఎదురయ్యే అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పరిశోధనలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లోకపావని, ప్రొఫెసర్లు రామ్, ప్రతిక్, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ఆలయాల వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి



డిప్యూటీ కమిషనర్ లావణ్యకు మెమోరాండం అందజేస్తున్న దృశ్యం

అబిడ్స్: ఉగాది, శ్రీరామనవమి పండుగలను పురస్కరించుకుని గోషామహల్ నియోజకవర్గంలోని ఆలయాల వద్ద తాత్కాలిక విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఆ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ కోరారు. ఈమేరకు అబిడ్స్‌లోని జీహెచ్ఎంసీ–14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లావణ్యకు మంగళవారం మెమోరాండం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పలు ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు, ప్యాచ్‌వర్క్‌లు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఆలయాల పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ కేలండర్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలి



టీజీపీఎస్సీ కార్యాలయం ఎదుట వినతి పత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: జాబ్ కేలండర్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరుతూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర నాంపల్లిలోని పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం చైర్మన్ బుర్రా వెంకటేశంను కలిసి వినతి పత్రం ఇచ్చేందుకు యత్నించగా పోలీసులు లోనికి అనుమతించకపోవడంతో కార్యాలయం ఎదుట ఇన్‌వార్డ్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కారణాలు చెప్పి ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వకపోవడం సరికాదన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు గత ప్రభుత్వపు అప్రజాస్వామిక పోకడలను అనుసరించవద్దని కోరారు. జాబ్ కేలండర్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు



ఆలయం వద్ద దేవాదాయ శాఖ అధికారులు

గోల్కొండ: ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ టి.శేఖర్ అన్నారు. నానల్‌నగర్ సాలర్‌జంగ్ కాలనీ తిరుపల్లిగడ్డలోని హనుమాన్ ఆలయం ఆనుకోని ఉన్న 100 గజాల ఆలయ స్థలం చుట్టూ అధికారులతో కలిసి మంగళవారం ప్రహరీ ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆలయానికి సంబంధించి కోట్లాది రూపాయల విలువైన ఆస్తులు కబ్జాకు గురయ్యాయని కోర్టులు, ట్రిబ్యునల్స్ తీర్పుల మేరకు కబ్జా అయిన స్థలాలను ఒక్కొక్కటిగా స్వాధీనం చేసుకుంటున్నామని తెలిపారు. ఆలయ నిర్వహణ కమిటీ మాజీ ప్రతినిధులు సైతం స్థల పరిరక్షణకు సహకరించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి సి.వసంత, ఇన్‌స్పెక్టర్ సురేఖ, సురేందర్, ఆలయ కమిటీ మాజీ ప్రతినిధులు నర్సింహ్మా, ఎస్.జనార్దన్ తదితరులు ఉన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఉద్యమకారుల ఫోరం ప్రతినిధులు

సికింద్రాబాద్: అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యమకారుల అంశంపై మాట్లాడాలని కోరుతూ మంగళవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ప్రతినిధులు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లారి అనిల్‌కుమార్ నేతృత్వంలో ఫోరం ప్రతినిధులు మంగళవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రిని ప్రభాకర్‌ను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం పెన్షన్ మంజూరు వంటి హామీలు ఇచ్చి ఇప్పటి వరకు ప్రారంభించలేదన్నారు. ఉద్యమకారుల ఫోరం నాయకులు జానకి రెడ్డి, జగన్ యాదవ్, నరసింహ చారిలు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి



ఎగ్జామ్ కిట్లతో విద్యార్థులు, రఘునాథ్

జియాగూడ: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని బీజేపీ గోల్కొండ జిల్లా డిస్ట్రిక్ కౌన్సిల్ మెంబర్ గంజి రఘునాథ్ కోరారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన 'భేటీ బచావో భేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా ముస్తాయిద్‌పురా ప్రభుత్వోన్నత పాఠశాలలో 80 మంది విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, పెన్నులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలిని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శివరత్నం, రాధాకృష్ణ, గోల్కొండ జిల్లా కౌన్సిల్ మెంబర్ శ్రీకాంత్ సాగర్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాల నిర్వహణ అభినందనీయం



ఫౌండేషన్ సభ్యులకు ప్రశంసా పత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ ముఖర్జీ

గన్‌ఫౌండ్రీ: ప్రభుత్వ కళాశాలల్లో స్వచ్ఛంద సంస్థలు జాబ్‌మేళా నిర్వహించి విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ కల్పించడం అభినందనీయమని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్ర ముఖర్జీ అన్నారు. నాంపల్లిలోని కళాశాలలో టీఎస్ఎస్ ఇండియా ఫౌండేషన్ బృందానికి కళాశాల తరపున ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత డిసెంబర్‌లో కళాశాలలో ప్లేస్‌మెంట్ నిర్వహించి 52 మంది విద్యార్థులను ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని జాబ్ మేళాలు నిర్వహించి విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై హర్షం



బషీర్‌బాగ్ చౌరస్తాలో సంబరాలు నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ శ్రేణులు

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలపడంపై తెలంగాణ రాష్ట్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు సోమవారం బషీర్‌బాగ్ చౌరస్తాలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద మాదిగ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహాల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి పటాకులు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృపాకర్ మాదిగ, తెలంగాణ మాదిగ దండోర రాష్ట్ర అధ్యక్షుడు చింత స్వామి మాదిగ, మహిళా విభాగం తదితరులు పాల్గొన్నారు.

భాగ్యనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

గౌలిపురా: భాగ్యనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా నియమితులైన జె.నిరంజన్ యాదవ్‌ను కుర్మగూడలోని ఆయన నివాసంలో గౌలిపురా డివిజన్ అధ్యక్షుడు సుమన్ కుమార్ ఆధ్వర్యంలో నాయకుల బృందం మంగళవారం కలిసింది. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొడి సురేందర్, జి.రఘుకాంత్, కె.రాజ్ కుమార్, గౌలీకర్ ధీరజ్‌లాల్, జమాల్‌పూర్ అశోక్, బి.రమేశ్ యాదవ్, పాల్గొన్నారు.

సాంకేతిక నిపుణులను అందించాలి

- సాంకేతిక విద్యాబోర్డు కార్యదర్శి ఎ.పుల్లయ్య
- ఆకట్టుకున్న 'సృజన టెక్‌ఫెస్ట్–2025'



టెక్‌ఫెస్ట్‌లో ప్రదర్శనను తిలకిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తదితరులు

విజయనగర్‌కాలనీ: పారిశ్రామికరంగాల అవసరాల మేరకు పాలిటెక్నిక్ కళాశాలల నుంచి నైపుణ్యమైన సాంకేతిక నిపుణులను అందించాలని సాంకేతిక విద్యాబోర్డు కార్యదర్శి ఎ.పుల్లయ్య పేర్కొన్నారు. మాసబ్‌ట్యాంక్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో 'సృజన టెక్ ఫెస్ట్–2025 పేరిట మంగళవారం విద్యార్థులకు సాంకేతిక ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఆయన పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహద పడుతాయన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచిన 12 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ అండ్ అలైడ్ బ్రాంచ్ విద్యార్థులు, స్పెషల్ బ్రాంచ్‌లకు సంబంధించిన 4 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు ప్రదర్శించిన మోడల్స్ ఆకట్టుకున్నాయి. పోటీల్లో నిర్మల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు మొదటి స్థానంలో, సిరిసిల్లా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నారు. అలాగే స్పెషల్ బ్రాంచ్ విభాగంలో రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ద్వితీయ స్థానంలో కులీకుతుబ్‌షా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రైజ్‌లు గెలుచుకున్నారు. కార్యక్రమంలో మాసబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.చంద్రశేఖర్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ యేసురత్నం, సీడీఎఫ్‌డీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డాక్టర్ వి.పున్నయ్య, టీజీఎస్‌టీడీసీఎల్ డివిజనల్ ఇంజినీర్ కె.సమ్మయ్య, నాట్కో ఫార్మా మేనేజర్ డాక్టర్ నర్మద, డాక్టర్ జహంగీర్, కృష్ణమూర్తి, ఎస్.శ్రీనివాసరావు, జి.రవికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.